## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- **ఈనెల30 వరకు ఓటు నమోదుకు అవకాశం**
- **కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్**
- **జిల్లా కేంద్రంలో ఓటరు అవగాహన ముగింపు ర్యాలీ**

పెద్దపల్లి కమాన్, అక్టోబర్ 18: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదు చేయాలని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సూచించారు. బుధవారం పెద్దపల్లి ఐటీఐ కళాశాల నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ఓటరు అవగాహన ముగింపు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్డీవో మధుమోహన్ ప్రారంభించగా, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 30న జరుగుతాయని, ఇందులో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో తమ పేరును సరి చూసుకోవాలన్నారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈనెల 30 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదయ్యేలా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరులకు ఓటు ప్రాముఖ్యాన్ని వివరించాలని సూచించారు. ఆర్డీవో మధుమోహన్ ఓటు హక్కు ప్రాముఖ్యాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఇక్కడ జిల్లా స్వీప్ ఆక్టివిటీస్ నోడల్ అధికారి రవూఫ్ ఖాన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, తదితరులు, గ్రామస్తులు ఉన్నారు.



పెద్దపల్లి కమాన్: ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్, అధికారులు

## ఆశీర్వాద సభ పనులను త్వరగా పూర్తి చేయాలి

- **కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ స్థలాన్ని పరిశీలించిన పుట్ట మధూకర్**



మంథని: సభా స్థలాన్ని పరిశీలిస్తున్న పుట్ట మధూకర్

మంథని, అక్టోబర్ 18: సభ స్థలంలో చేపట్టాల్సిన పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులు, నాయకులకు బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ సూచించారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభా స్థలాన్ని బీఆర్ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ బుధవారం పరిశీలించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్‌కు మద్దతుగా వచ్చే 7వ తేదీన నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ మంథనికి రానున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ సభ కోసం పుట్ట మధూకర్ స్థలాన్ని పరిశీలించారు.

### దురా దేవీ వద్ద పుట్ట దంపతుల పూజలు

స్థానిక హనుమాన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత దేవీని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఆయన సతీమణి మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి వద్ద పుట్ట దంపతులు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, యాకుబ్, ఆకుల కిరణ్, వెల్పుల గట్టయ్య పాల్గొన్నారు.

పాలకుర్తి, అక్టోబర్ 18: పాలకుర్తి మండలంలోని శాలపల్లి, జీడీనగర్ దుర్గామాత విగ్రహాలను బుదవారం మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్టమధు సందర్శించారు. రెండు గ్రామాల్లోని మండపాల్లో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాబోయే ఎన్నికల్లో మంథని నియోజకవర్గ పరిధిలోని పాలకుర్తి మండలంలోని 9 పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కన్నాల ప్యాక్స్ చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు పిట్ల గోపాల్, మల్కారామ స్వామి, సర్పంచ్ బదావత్ రాజునాయక్, ప్యాక్స్ వైస్ చైర్మన్ కురిక్యాల సురేశ్, ఉపసర్పంచ్ పుట్ట రంజిత్, కేశోరాం ప్రధానకార్యదర్శి దాడి మహేశ్, నాయకులు, భవానీ దీక్షాపరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ లోకి కొనసాగుతున్న వలసలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్18: బీఆర్ఎస్‌లోకి వివిధ పార్టీల నుంచి వలసలు కొనసాగుతున్నాయి. మండలంలోని ఆశన్నపల్లె చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు మంద సంజీవులు, నాయకులు పెండ్లి శ్రీకాంత్, పెండ్లి సురేశ్, కాంగ్రెస్ నాయకులు మిడిదొడ్డి శ్రీకాంత్, ఎరుకల సంజీవ్, కూస తిరుపతి, కదురు రాజయ్యలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గులాబి గూటికి చేరగా, వారికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంద రమ వెంకన్న, ఎంపీటీసీ పెండ్లి సంపత్, గ్రామ నాయకులు కదురు రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.



సుల్తానాబాద్ : ప్రచారం చేస్తున్న నాయకులు

సుల్తానాబాద్, అక్టోబర్ 18 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతారమేశ్ అన్నారు. పట్టణంలో 8వ వార్డు మార్కండేయ కాలనీ, దుబ్బపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచి చరిత్ర సృష్టించిన దాసరి మనోహర్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామన్నారు. ప్రచారంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పారుపెల్లి గుణ పతి, కౌన్సిలర్లు కూకట్ల గోపి, పసెడ్ల మమతసంపత్, గుర్రాల శ్రీనివాస్, సూరశ్యాం, ఎల్‌రావు, సాజిద్, గిరుగుల శ్రీనివాస్, బోయిరి రాజేందర్, నీరుకుళ్ళ సమ్మయ్య, రాహుల్, వెంకటేశ్ ఉన్నారు.

## దివ్యాంగురాలి కృతజ్ఞత

- **ట్రైసైకిల్‌పై బీఆర్ఎస్‌కు ప్రచారం**
- **ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించిన కోమల**



ఓ దివ్యాంగురాలు బీఆర్ఎస్‌పై తన కృతజ్ఞతను చాటుకుంది. నెలనెల ₹4,016 పింఛన్ ఇస్తూ కన్న తండ్రోలే ఆదుకుంటున్న సీఎం కేసీఆర్‌పై తన అభిమానాన్ని చూపింది. ట్రైసైకిల్‌కు గులాబీ జెండా కట్టుకుని ఇంటింటా తిరుగుతూ సీఎం కేసీఆర్ సార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సార్‌ను గెలిపించాలని అభ్యర్థించింది. కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దంపేటకు చెందిన దివ్యాంగురాలు అక్కల కోమల బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డికి మద్దతుగా అతని తనయుడు దాసరి ప్రశాంత్‌రెడ్డి తమ గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని కారు గుర్తుకే ఓటేటెయ్యాలని కోరింది.

**- కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్18**

### నీటి విడుదల పై రైతుల హర్షం

ముత్తారం అక్టోబర్ 18 : ముత్తారం మండలంలోని శుక్రవారం పేట చింతల చెరువు రిజర్వాయర్ లో నీరు లేనందున మండలంలోని లక్కారం , మైదంబండ, పోతారం,మచ్చుపేట, సర్వారం, గ్రామాలలో రైతుల పంటపొలాలకు నీటి ఇబ్బందులు ఎర్పాడే పరిస్థితి ఉన్నందున మంథని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి,ప్రస్తుత జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌ను స్థానిక రైతులు, నాయకలు సమస్యను వివరించగా వెంటనే స్పందించిన అయన అధికారులతో మాట్లాడి కమాన్‌పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్ నుంచి చింతల చెరువుకు బుధవారం నీటిని విడుదల చేశారు. విడుదల అయిన నీటిని మండల రైతు సమితి అధ్యక్షుడు అత్తే చంద్రమౌళి పరిశీలించారు.వెంటనే స్పందించి నీటిని విడుదల చేపించిన జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ కు రైతులు కృతజతలు తెలిపారు.ఇక్కడ ఎంపీటీసీ ఒద్ది తిరుమల తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

## ర్యాలీలు, సభలకు అనుమతులు తీసుకోవాలి

రామగిరి అక్టోబర్ 18 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు నిర్వహించ తలపెట్టిన ర్యాలీలు, సభలకు తప్పని సరి అనుమతులు తీసుకోవాలనీ మంథని అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో అనుమ నాయక్ తెలిపారు. బుధవారం మంథని జేఎన్టీయూహెచ్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎన్నికల కోడ్‌పై నియోజక వర్గంలోని పార్టీల నాయకులు, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీంలు వివిధ విభాగాలను చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. గోడలపై రాతలు, వాల్ పోస్టర్లు, ప్లేక్సిలు ఉంటే ఆయా పార్టీలకు చెందిన ఆభ్యర్థి ఖర్చులో రాయడం జరుగుతుందన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేల డబ్బు, మద్యంతో ఏర వేసిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎన్నికలు సహజవు జరిగేల సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో నియోజక వర్గంలోని తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, పోలీస్ అధికారలు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల నిబంధనలపై సమీక్ష

జ్యోతినగర్, అక్టోబర్ 18: అసెంబ్లీ ఎన్నికల్లో పాటించాల్సిన ఎన్నికల నిబంధనలపై పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీ ప్రిటింగ్ ప్రెస్ యాజమానులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ మేరకు బుధవారం ఎన్టీపీసీ టీటీఎస్‌లో ఏర్పాటు చేసిన రామగుండం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల కమిషన్ సూచించిన నియమాలను ప్రిటింగ్ ప్రెస్ యాజమానులకు వివరించారు. ఎన్నికల్లో పోటీ అభ్యర్థుల కరపత్రాలు, పోస్టర్లు, ఇతర ప్రచార మెటీరియల్స్ ముద్రణ, ప్రచురణపై ప్రిటింగ్ ప్రెస్ యాజమానులు ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ముద్రణపై ప్రిటింగ్ ప్రెస్ పేరు. ప్రచురణకర్త పేరు. సెల్ నెంబర్, చిరునామా స్పష్టంగా ముద్రించాలన్నారు. ముద్రించిన పేపరు, ప్రచురణకర్త నుంచి పొందిన డిక్లరేషన్‌తో సహ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల కార్యాలయంకు మూడు రోజుల్లో అందజేయ్యాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లఘించిన ప్రిటింగ్‌ప్రెస్ యాజమానులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో వేరుగా అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా కోసం చాలన్ చెల్లింపుతో జాబితా అందజేస్తామని, ఎన్నికల అవకతవలపై ఫిర్యాదు స్వీకరిస్తామని వారి వివరాలను గోప్యంగా ఉంచునున్నట్లు తెలిపారు.

## సింగరేణి సోలార్ పవర్ ప్లాంట్‌లో దొంగలు

కమాన్‌పూర్, అక్టోబర్ 18: మండలంలోని జూలపల్లి సోలార్ ప్లాంట్‌లో కాపర్ వైరు దొంగిలిస్తున్న ముఠాను కమాన్‌పూర్ పోలీసులు అరెస్టు చేశారు. సింగరేణి ఆర్జీ–3 ఏరియాకు చెందిన 50 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ తగ్గదల కనిపిస్తుందని, సెక్యూరిటీ సూపర్‌వైజర్ సిద్ధ భానుచందర్ ఫిట్టర్ అనిల్‌తో కలిసి పరిశీలించగా ఈనెల 2న 740 మీటర్లు, 4న 640 మీటర్లు గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైరు కత్తిరించి ఎత్తుకెళ్లినట్లు గుర్తించి ఈనెల 13న ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించగా మండలంలోని కల్వచర్లకు చెందిన సాదుల కనకయ్య, నీర్ల సతీశ్ కుమార్, గుర్రాల నర్సయ్య, సాదుల వంశీ కలిసి ఈ కాపర్ వైరు చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరంతా కూలీ పని చేసుకంటూ జీవించేవారనీ ముల్కలపల్లి శివారులోని సింగరేణికి చెందిన పవర్ ప్లాంట్‌లో కూలీ పనికి వెళ్తున్నారని తెలిపారు. ఈనెల 2వ తేదీన 740 మీటర్లు కాపర్ వైరు కట్ చేసి కాంపౌండ్ వాల్ బయట పడేసి సాయంత్రం వరకు పని చేసుకొని అక్కడ నుంచి వెళ్లిపోయి చీకటి పడిన తర్వాత వచ్చి కట్ చేసిన వైరును తీసుకవెళ్లి దాన్ని కాల్చవేసి అందులో నుంచి వచ్చిన కాపరును కల్వచర్లకు చెందిన బోల్ల షాపు దుకాణం యజమాని మహేశ్‌కు రెండు కిలోల కాపరు అమ్మగా 2వేలు ఇచ్చినట్లు తెలిపారు. మల్లీ 4వ తేదీన కూలీ పనికి వెళ్లి 640 మీటర్లు కాపర్ కేబుల్ కట్ చేసి యథావిధిగా గోడపై నుంచి బయట పడేసి, ఎప్పటిలాగే డ్యూటీ అయ్యాక రాత్రి సమయంలో అటుగా వెళ్లి కాపర్ వైరు తెచ్చుకొని అమ్మేవారన్నారు. బుధవారం కాపర్‌ను అమ్మేందుకు టీవీఎస్ ఎక్స్ ఎల్ వాహనంపై దాచి పెట్టిన కేబుల్‌ను తీసుకొని అమ్మేందుకు బయలుదేరుతుండగా ముల్కలపల్లి వాగు ప్రక్కన ఎల్లమ్మ గుడి వద్ద ఉండటం చూసి నిందితులు పారిపోతుండగా పోలీసులు పట్టుకొని విచారించగా అసలు విషయం చెప్పారని, దీనితో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### బతుకమ్మ వేడుకలు

రామగిరి, అక్టోబర్ 18:జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థినులు హాజరై తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆట, పాటలతో హోరెత్తించారు. బ్రాంచ్‌ల వారీగా ఉద్యోగులు, విద్యార్థినులు అందంగా బతుకమ్మలను పేర్చుకొని క్రీడా ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం బతుకమ్మ పాటలతో అలరించారు. నృత్యాలు ఆకట్టుకున్నాయి.